సాక్షి
ములుగు

శనివారం | 28 | డిసెంబర్ | 2024



నిరాడంబరంగా సీఎం కప్ పోటీలు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఐదు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు శుక్రవారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. - 10లో▸



దీక్షాంత్ పరేడ్ రద్దు..

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో శుక్రవారం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో జరగాల్సిన దీక్షాంత్ పరేడ్ రద్దయింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$29.4^{0}/18.5^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాలి



వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ హక్కులు, చట్టాల కోసం ఆదివాసీ యువత ఉద్యమించాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ఉన్న హక్కులు, చట్టాలు, జీఓలపై ఆదివాసీ యువతకు అవగాహన అవసరమన్నారు. జనవరి 8న మండల కేంద్రంలో ఆదివాసీ హక్కులు, చట్టాలపై నిర్వహించే అవగాహన సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పూనెం మునేశ్వరావు, తాటి లక్ష్మణ్, పూనెం సాయి కీర్తన, చింత ప్రశాంత్, తాటి నర్సింహారావు, చింత విజయ్, పూనెం పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఏటూరునాగారం: ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఏటూరునాగారానికి చెందిన జాడి రాధిక, హర్షిత్ ఎంపికైనట్లు ఏటూరునాగారం కోచ్ పర్వతాల కుమారస్వామి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా టీం నుంచి ఇద్దరు క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. వారిని స్థానిక ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

30వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు బంద్

ములుగు: కాటన్ మిల్లుల్లో నిల్వలు ఎక్కువగా ఉన్న కారణంగా నేడు(28వ తేదీ) పత్తి కొనుగోళ్లను నిలిపివేసినట్లు ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు 29వ తేదీ (ఆదివారం), 30వ తేదీ (అమావాస్య) కావడంతో పత్తి మిల్లులు మూసి ఉంటాయని పేర్కొన్నారు. తిరిగి 31వ తేదీ కొనుగోళ్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈవిషయాన్ని జిల్లాలోని పత్తి రైతులు గమనించాలని సూచించారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు విరమించుకోవాలి

ములుగు: సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉన్నారనే కారణాన్ని చూపుతూ కేజీబీవీలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్ వేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీశ్‌కుమార్, ఏళ్ల మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తే ఈ ఇబ్బందులు లేకుండా పోతాయన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఉద్యోగులకు వేతనం అందించాలన్నారు. సోమవారం నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రకటించడాన్ని దృష్టిలో పెట్టుకొని ఈలోపు తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు భావిస్తున్నామన్నారు.

నేడు శని త్రయోదశి పూజలు

కాళేశ్వరం: శనిత్రయోదశి సందర్భంగా కాళేశ్వరం దేవస్థానంలోని అనుబంధ ఆలయంలో నవగ్రహాల వద్ద శనివారం ఉదయం నుంచి శనిపూజలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తెల్లవారుజామున తరలివచ్చి త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి నవగ్రహాల వద్ద శని పూజలు చేసుకోనున్నారు. ఈ పూజలతో శని దోషం తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. పూజ ఫలితంతో పీడిత, తాడిత బాధల నుంచి విముక్తి పొందుతారని పండితులు పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రేగొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. మండలంలోని రూపిరెడ్డిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. దమ్మన్నపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నితిన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

రుద్రగూడెం శివారులో పెద్దపులి పాదముద్రను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు



తల్లి, పిల్ల.. ఓ మగపులి

నల్లబెల్లి, కొత్తగూడ మండలాల్లో పులుల సంచారం

- భయం గుప్పిట్లో రెండు మండలాల జనం
- పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులి పిల్ల..
- కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కోనాపురంలో మగపులి పాదముద్రలు
- వ్యవసాయ పనులకు వెళ్లని రైతులు, కూలీలు

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాల శివారులో, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కోనాపురం అటవీప్రాంతంలో పులుల సంచారం వార్త కలకలం రేపుతోంది. ఈ రెండు మండలాల్లో ఓ ఆడపులి, పిల్ల పులి, మరో మగ పులి సంచారం నిర్ధారణ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మల్లబోయిన కొమురయ్య రోజు మాదిరిగానే గురువారం తనకున్న 150 మేకలను పెద్దలొద్ది అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. అడవి జంతువును తింటున్న పెద్ద పులిని చూసి మేకలు, కుక్క భయపడి బెదిరి చెల్లాచెదురయ్యాయి. పెద్దలొద్ది అవతలి ఒడ్డున పెద్దపులి కనిపించడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొమురయ్య వెనుదిరిగాడు.

పొలాలనుంచి వెనుదిరిగిన రైతులు

నల్లబెల్లి మండలంలోని వ్యవసాయ పొలాల వద్ద పులి పాదముద్రలను గుర్తించిన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రా మాలను సందర్శించారు. అటవీ ప్రాంతం, పంట పొలాల్లో గాలింపు చేపట్టారు. కొండాపూర్ పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులిపిల్ల పాదముద్రలు ఉండగా, కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రామాల్లోని పంట పొలాల్లో, కొత్తగూడ మండలం కోనాపురం మునలి మడు గు అటవీ ప్రాంతంలోని పొలాల్లో మగపులి పాదముద్రలను సేకరించారు. చివరగా ఆడపులి తన పిల్లతోపాటు, మగపులి కోనాపూర్ అటవీప్రాంతానికి వేర్వేరుగా వెళ్లినట్లు చెబుతు న్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు పెద్ద పులుల సంచారం విషయం తెలియడంతో పనులు చేయలేమని వెనుదిరుగుతున్నారు. కూలీల భయాన్ని అర్థం చేసుకున్న రైతులు చేసేదేమిలేక మిన్నకుండిపోతున్నారు.

గ్రామాల్లో దండోరా

నల్లబెల్లి మండలంలో పెద్ద పులుల సంచారంతో పోలీస్ అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు. 'పంట పొలాల్లో పెద్ద పులుల సంచారం ఉంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. రెండు రోజుల వరకు రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లొద్దు.. రాత్రి వేళ ఒంటరిగా వెళ్లొద్దు.. ఒక వేళ పెద్దపులులు కనిపిస్తే పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.. పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చవద్దు' అని సూచిస్తున్నారు.



కోనాపురంలో అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు



అధికారులు సేకరించిన తల్లి, పిల్ల, మగ పులి అడుగులు

వ్యవసాయ పనులు చేయలేకపోతున్నాం..



రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి శివారులో పెద్దపులి సంచరించినట్లు పాదముద్రల ఆనవాళ్లు ఉన్నాయి. వ్యవసాయ పనుల కోసం శుక్రవారం ఉదయం వచ్చిన కూలీలు, రైతులు తిరిగివెళ్లారు. రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి మధ్య పంటపొలాల్లో ఉన్న పలుగు ఏనలో పెద్దపులి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు సందేహం వ్యక్తం చేశారు. పులి ఉన్నట్లు గుర్తిస్తే అటవీ ప్రాంతానికి పంపించే చర్యలు అధికారులు చేపట్టాలి.

– బుర్ర రాఘవరెడ్డి, రైతు, రుద్రగూడెం

అప్రమత్తంగా ఉండాలి



పులులు సంచరించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రెండు రోజులు వ్యవసాయ పనుల కోసం పంట పొలాలు, బయటకి వెళ్లొద్దు. గ్రామస్తులు, రైతులు, గొర్రెలకాపరులు జాగ్రత్తగా ఉండాలి. పంటలను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయవద్దు. పులి తిరిగి వెళ్లిపోతుంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం.

– రవికిరణ్, ఎఫ్ఆర్ఓ, నర్సంపేట



రివైండ్ 2024

తెలంగాణ ప్రజల చూపంతా ఇప్పుడు గ్రేటర్ వరంగల్‌పైనే. రోడ్డు, రైలు మార్గాలైనా.. విమానయానమైనా, హెల్త్ హబ్‌గా పేరొందాలన్నా.. నియో మెట్రో స్టేషన్ ఏర్పాటు చేయాలన్నా.. రాష్ట్ర రాజధాని తర్వాత వరంగల్‌కే స్కోప్ ఎక్కువ. నిధుల కొరత ఒకవైపు ఉన్నా.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు ఈ ఏడాది(2024)లో కొంత కదలిక వచ్చింది. పలు ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. ఈ ఏడాది నగరంలో జరిగిన అభివృద్ధి, కొనసాగుతున్న పనులపై 'సాక్షి' మననం.

- వివరాలు 10లో▸

న్యాయం జరిగేలా దర్యాప్తు చేయండి: ఎస్పీ



నేర సమీక్షలో వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ శబరీష్

ములుగు: ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధి సీఐలు, ఎస్సైలతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి జరగకుండా చూడాలన్నారు. మినీ మేడారం జాతర బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఓఎస్డీ, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ అజయ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పస్రా, ఏటూరునాగారం, వెంకటాపురం(కె) సీఐలు రవీందర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు రామకృష్ణ, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజొద్దీన్, సూరి, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలి

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీఆర్టీలు

ఏటూరునాగారం: సీఆర్టీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఆర్టీల సమ్మె శుక్రవారంతో ఐదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా శ్రీపాల్‌రెడ్డి వారికి మద్దతు పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఆర్టీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోదెం రవీందర్, జిల్లా అధ్యక్షుడు కొండ రామయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమ్మయ్య రాథోడ్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ధరమ్ సోత్ రాజు, మాజీ అధ్యక్షుడు భూక్యా తిరుపతి, హరిలాల్, వట్టం శంకర్, హరిచంద్ర, లక్ష్మణ్, కీమా, అరుణ్, కిషన్, పదావత్ శీను, గట్టిపల్లి శ్రీనివాస్, కత్తర్ల మల్లయ్య, చందు, రేగ రమేశ్, నరేశ్, పార్వతీబాయి, కల్పన, జజ్జరి పార్వతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్వల్ దుర్గం నగేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఆర్టీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు పలికి మాట్లాడారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా పని చేస్తున్న వీరందరిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం పోరాటం..

- ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి
- ములుగుకు చేరిన బస్సుయాత్ర



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశవర్కర్లు

ములుగు రూరల్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు రూ.18 వేలు సాధించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆశాల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆశాల బస్సు యాత్ర ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఆశాలు బోనాలు, బతుకమ్మలు, కోలాటాలతో డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి రవికుమార్ మాట్లాడారు. ఏఎన్సీల టార్గెట్ పేరుతో ఆశాలను శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ప్రజలకు ప్రభుత్వ స్కీములు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో 17వ షెడ్యూల్ ప్రకారం అసంఘటిత కార్మికులు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. కార్మికులు సంఘటితంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, బస్సు యాత్ర బృందం సభ్యులు గంగమణి, సునీత, పద్మ, సాధన, బాలమణి, ఎండీ దావూద్, రత్నం రాజేందర్, తుమ్మల వెంకట్‌రెడ్డి, గఫూర్, రవిగౌడ్, ఉపేంద్రచారి, ప్రవీణ్, రవి, మంజుల, శ్రావ్య, నాగమణి, రజిత, కవిత, సుమలత, ప్రభావతి, సుధ, పూర్ణ, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

ఓసీ-3 మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-3లో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న గని మేనేజర్ భానుప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ ప్రేమ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు, అధికారుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. అనేక సందర్భాల్లో కార్మికుల పట్ల అవమానకర రీతిలో ప్రవర్తిస్తున్నారన్నారు. మేనేజర్‌పై ఏరియా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కాళేశ్వరం అర్చకుడికి అవార్డు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మకు మనం ఫౌండేషన్ అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో అవార్డు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పలువులు ఆయనను అభినందించారు.

మహాసభను విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నల్లగొండలో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభను జయప్రదం చేయాలని యూనియన్‌జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నక్క తిరుపతి, కొత్త కుమారస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో భాగంగా మొదటి రోజు భారీ ర్యాలీ, పలు విద్యారంగ సమస్యలపై చర్చ, పరిష్కార మార్గాల అన్వేషణ ఉంటుందన్నారు. రెండో రోజు వైజ్ఞానిక ప్రదర్శనలు, విద్యారంగంలో నూతన ఒరవడులపై చర్చ, మూడో రోజు పలు తీర్మానాలపై చర్చ ఆమోదం, రాష్ట్ర కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మార్త రాజేందర్, కోశాధికారి తిరుపతయ్య, జిల్లా కార్యదర్శులు రామయ్య, రఫీపాషా, కె.రమేష్, కె.శ్రీధర్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



మాట్లాడుతున్న పూనెం సాయి

వాజేడు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో రోజురోజుకూ విద్యా వ్యవస్థ దిగజారిపోతోందన్నారు. ఏజెన్సీలో విద్య వైఫల్యం చెందడానికి అధికారులే కారణమని ఐటీడీఏలో వైఫల్యంపై ఎన్ని దరఖాస్తులు ఇచ్చినా ఉపయోగం లేదన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీ గ్రామాల్లో విద్యను అభివృద్ధి చేయడానికి కనీస నిధులు మంజూరు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీ విద్యార్థులు విద్యా లక్ష్యాలను సాధించలేక పోవడానికి, కనీస నైపుణ్యం మెరుగవకపోవడానికి ప్రభుత్వాలే కారణమన్నారు. ఏజెన్సీలో విద్య రోజు రోజుకూ అంతరించి పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అభిప్రాయపడ్డారు. 5వ షెడ్యూల్ భూభాగంలో విద్యా నియామకాలు ఐటీడీఏ ద్వారా జరగాలని సీఆర్టీలుగా ఆదివాసీలకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కారం ఆనంద్, పూనెం ప్రతాప్ తదితరులున్నారు.

పోరు కన్నా.. ఊరు మిన్న

- మావోలు స్వచ్ఛందంగా లొంగిపోతే పునరావాసం కల్పిస్తాం
- ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్



సుజాతకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీష్

గోవిందరావుపేట: అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని మావోయిస్టులకు ఎస్పీ డాక్టర్ శబరీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ అజాద్ ఇంటికి వెళ్లి అతడి భార్య సుజాతను కలిసి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. ఈసందర్భంగా సుజాత కుటుంబ ఇంటి పరిస్థితులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అజ్ఞాతంలో ఉన్న సాంబయ్య అలియాస్ అజాద్‌ను లొంగిపోయేలా నచ్చజెప్పాలని భార్య సుజాతకు సూచించారు. ఈసందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. మావోయిస్టులు స్వచ్ఛందంగా జనజీవన స్రవంతిలో కలిస్తే పునరావాసం కల్పిస్తామన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. అనంతరం సుజాతకు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, పస్రా ఎస్సై కమలాకర్‌లు పాల్గొన్నారు.

నిన్నే నమ్ముకున్నాం లొంగిపో..

నిన్ను పెళ్లి చేసుకుని జీవితం మొదలుపెట్టాను. ఏ రోజూ కూడా కంటి నిండా నిద్రపోలేదు. ఇన్నేళ్లైనా మేం నీకు గుర్తుకు రాలేదా? నువ్వు లొంగిపోయి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపు. నిన్ను పోలీసులు ఏమనరు. లొంగిపోతే ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేలా ఎస్పీ సారు చూసుకుంటారు. అడవిలో ఉండి సాధించేదేమీ లేదయ్యా.. ఇంటికిరా..

– కొయ్యడ సుజాత, మావోయిస్ట్ అజాద్ భార్య, దుంపెల్లిగూడెం

ఉచితంగా కోళ్ల పంపిణీ



కోళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధి బంజారా ఎల్లాపూర్, నర్సాపూర్ గ్రామ ప్రజలకు శుక్రవారం పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం–పశు పరిశోధన క్షేత్రం మామునూరు వారి ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా ఉచితంగా కోళ్ల పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశు వైద్యాధికారి కొమురయ్య, మండల పశు వైద్యాధికారులు నరసింహులు, రాజశేఖర్ హాజరై మాట్లాడారు. ఉచిత కోళ్ల పంపిణీ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేసుకుని వాటి నుంచి వచ్చే గుడ్లు తినడంతో పోషకాహారం పొందుతూ.. వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. అలాగే ఒక్కొక్కరికి 6 వారాల వయస్సు ఉన్న 2,300 పెరటి కోడి పిల్లలను, వాటికి కావాల్సిన దాణా తొట్టిలు, నీటి తొట్టిలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆఫీసర్ డాక్టర్ అమరేశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్ రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణమే ధ్యేయం



పతాకావిష్కరణ చేస్తున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సమ సమాజ నిర్మాణమే ధ్యేయమని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. అంతరాలు లేని సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా కమ్యూనిస్టులు సీపీఐ పనిచేస్తుందని అన్నారు. వందేళ్ల సీపీఐ చరిత్రలో ఎన్నో పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత పార్టీకే దక్కిందన్నారు.

పాపం పసికందు..

● రైలులో బాలుడిని వదిలివెళ్లిన మహిళ
● డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చిన ప్రయాణికులు
● చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించిన కాజీపేట జీఆర్ పోలీసులు


రైలులో మహిళ వదిలి వెళ్లిన బాలుడు

కాజీపేట రూరల్ : పాపం పసికందు. భార మనుకుందో? లేదా అపహరిస్తుందో తెలియదుకాని ఓ మహిళ.. బాలుడిని రైలులో వదిలేసి వెళ్లింది. దీంతో ఆ బాలుడు వెక్కివెక్కి ఏడ్చుకుంటూ ఆమె కోసం రైలులోనే తిరుగుతుండగా ప్రయాణికులు గుర్తించారు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించగా కాజీపేట జీఆర్ పోలీసులు చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌సోల్– నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ రెండు, మూడు సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ బాలుడిని జనరల్ బోగీలో వదిలి వెళ్లిపోయింది. ఆమె కోసం బోగీలో అమాయకంగా తిరుగుతున్న బాలుడిని గుర్తించిన ప్రయాణికులు.. డయల్ 100కు కాల్ చేశారు. పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది కాజీపేట జీఆర్పీ పోలీసులను అప్రమత్తం చేశారు. రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగా బోగీలో నుంచి బాలుడిని చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ సిబ్బందికి అప్పగించారు. కాగా, బాలుడిని వదిలివెళ్లిన మహిళ బాలుడి తల్లేనా? లేదా బాలుడిని తరలిస్తుందానే కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే కాజీపేట జీఆర్పీ ఎస్‌హెచ్‌ఓ 8712658609, 9490027342 సెల్ నంబర్లలో సంప్రదించాలని కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కోరారు.

చోరీలకు పాల్పడిన నిందితురాలి అరెస్ట్

● 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం

జనగామ రూరల్: రద్దీ ప్రదేశాల్లో దృష్టి మరల్చి పలువురి మహిళల నుంచి ఆభరణాలు అపహరిస్తున్న నిందితురాలిని జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామకు చెందిన చొల్లేటి నివేదిత అక్టోబర్ 6వ తేదీన ఆర్టీసీ బస్సులో కాజీపేట నుంచి జనగామ వస్తోంది. ఈ క్రమంలో నిందితురాలు ఏపీలోని కర్నూల్ జిల్లా బుదారిపేటకు చెందిన అక్షింతల సంధ్య హైదరాబాద్ వెళ్లడానికి స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇదే బస్సు ఎక్కి నివేదిత పక్కన కూర్చుంది. మాటల్లో దింపి నివేదిక వద్ద ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరిచిన బ్యాగును అపహరించింది. జనగామ బస్టాండ్‌లో దిగిన నివేదిత ఇంటికి వెళ్లిన అనంతరం మరో బ్యాగును చూడగా అందులో ఆభరణాలు భద్రపరిచిన బ్యాగు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఏసీబీ పార్థసారథి పర్యవేక్షణలో చేపట్టారు. ఈ క్రమంలో సీఐ పి. దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్ గురువారం మధ్యాహ్నం పెంబర్తి వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఓ కారు పోలీసులను చూసి కొద్ది దూరంలో ఆపి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించారు. బస్సులో ఆభరణాలు ఉన్న బ్యాగును అపహరించింది తానేనని సంధ్య ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ దామోదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడు. కాగా, కేసు చేధనలో ప్రతిభ కనబరిచిన సీఐ పి. దామోదర్ రెడ్డి , ఎస్సై భరత్, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అభినందించారు.



విమానయానం

మరికొద్ది రోజుల్లో నగరం నుంచి విమానాలు ఎగరనున్నాయి. కేంద్రం ఉడాన్ (ఉడో దేశ్ కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని 2022 సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. వరంగల్ శివారులోని మామునూరులో నిజాం కాలంనాటి ఎయిర్ స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1,400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్ వే ఉంది. ఆ పాత ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధీనంలో ఉంది. మిగతా భూసేకరణకు కూడా రైతులు అంగీకరించారు. ఎయిర్‌పోర్టు పూర్తయితే 50 నుంచి 186 మంది ప్రయాణించేలా వీలున్న 37.6 మీటర్లు (123 ఫీట్లు) పొడవున్న ఏ 320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ చకచకా..

కాజీపేట అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు మంజూరు చేసింది. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇక్కడ వందే భారత్‌తో సహా అన్ని రకాల రైల్వేకోచ్‌లు తయారుకానున్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10వేల మందికి ఉపాధి లభించనుంది.

భళా.. కాళోజీ కళాక్షేత్రం

హనుమకొండ బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066 'కుడా' (హయగ్రీవాచారి కాంపౌండ్) భూమిలో 4.20 ఎకరాల్లో పూర్తి సెంట్రలైజ్డ్ ఏసీతో అత్యాధునిక ఆడియో, విజువల్ సిస్టమ్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలు, థియేటర్ ప్రదర్శనలు, ప్రొజెక్టర్, ప్రీ–ఫంక్షన్ లాబీ, ఆట్రియంలు, ల్యాండ్ స్కేపింగ్, వీధి దీపాలు, ఫౌంటెన్లతో నిర్మించారు. చిన్నపాటి సాంస్కృతిక సమావేశాల కోసం ప్రత్యేకంగా నాలుగు మినీ హాళ్లు అందుబాటులో ఉన్నాయి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో కాళోజీ నారాయణరావు ఫొటోలు, జ్ఞాపకాలు, పురస్కారాలు వంటి అంశాలు ప్రదర్శిస్తారు. వీల్ చైర్స్ కోసం ప్రత్యేకంగా ర్యాంప్ నిర్మించారు. రాజసం ఉట్టిపడేలా చేపట్టిన నిర్మాణం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కన్నా పెద్దదిగా చెప్పవచ్చు.

తల్లీ.. భద్రకాళి

నగరంలోని భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణంలో భాగంగా చెరువును 60 అడుగులు ముందుకు జరపాల్సి ఉంది. దీంతోపాటు చెరువు ఆధునికీకరణ చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటికే చెరువులోని నీటిని ఖాళీ చేశారు. పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టూ నిర్మించే మాడవీధుల నిర్మాణంలో భాగంగా ఆలయానికి ప్రాకారం నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాకారానికి నాలుగు దిశల్లో నాలుగు ద్వారాలు ఏర్పాటుచేసి వాటికి గోపురాలు నిర్మించనున్నారు. ఉత్తరం వైపున ఉన్న వేదపాఠశాలనుంచి ప్రస్తుతమున్న ప్రధాన గేటు తూర్పు వైపుగా ఏర్పాటు చేయనున్నారు. అమ్మవారికి ఎదురుగా రాజగోపురం 120 అడుగుల ఎత్తు.. 9 అంతస్తులతో నిర్మించనున్నారు. ఒక్క రాజగోపురానికే రూ.20 కోట్లు ఖర్చవుతాయని అంచనా.

కాజీపేట జంక్షన్ రీమోడలింగ్

కాజీపేట జంక్షన్‌ను అమృత్‌భారత్ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికుల అప్పర్‌క్లాస్ వెయిటింగ్ హాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్ బ్లాక్, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్ గార్డెన్, రోడ్లు, పాత్‌వే, పార్కింగ్, సర్క్యులేషన్ ఏరియా స్మూత్ ట్రాఫిక్ ఫ్లో, రెండు లిఫ్టులు, 3 ఎస్కలేటర్లు, ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైన్ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్ హోటల్, కమర్షియల్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. వంద ఏళ్ల కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. అన్ని విధాలా రెనోవేషన్ పనులు పూర్తయితే కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్‌గా చూడవచ్చు.

రైజింగ్.. సిటీ!

ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులతో వరంగల్ నగరానికి న్యూ లుక్..

● గ్రేటర్ పరిధిలో పలు అభివృద్ధి పనులు ● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో మెడికల్ హబ్
● అయోధ్యపురంలో వందేభారత్‌తో సహా అన్ని రైల్వే కోచ్‌ల తయారీ
● తిరుమాడ వీధులతో భద్రకాళికి కొత్త రూపు ● కళామతల్లి సిగలో కాళోజీ కళాక్షేత్రం

గ్రేటర్ వరంగల్ మహానగరం కొత్త లుక్ సంతరించుకుంటోంది. రాష్ట్ర రాజధానికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ నగరం 406 కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలో రెండో అతిపెద్దది. రాష్ట్రానికి రెండో రాజధాని అయ్యేందుకు అన్ని అర్హతలుండడం, భవిష్యత్ అవసరాల దృష్ట్యా అన్ని హంగులు సమకూరుతున్నాయి. కాకతీయులు నిర్మించిన కోటలు, సరస్సులు, దేవాలయలతో ప్రసిద్ధ పర్యాటక ఆకర్షణ నగరంగా గుర్తింపు పొందగా ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులతో సరికొత్తనగరంగా రూపుదిద్దుకుంటోంది. నగరంలో ఈ ఏడాది(2024)కొనసాగుతున్న ముఖ్యమైన అభివృద్ధి పనుల ఏఐ (నమూనా) చిత్రాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

– వరంగల్ డెస్క్

వరంగల్ ఆర్టీసీ బస్టాండ్.. నియో మెట్రో స్టేషన్

వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణకు సుమారు నాలుగు దశాబ్దాల తరువాత ముహూర్తం కుదిరింది. 1984లో ఈ బస్టాండ్‌ను ప్రారంభించగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక హంగులతో నిర్మించతలపెట్టారు. ఈ మేరకు పాత బస్టాండ్‌ను కూల్చివేశారు. రైల్వేస్టేషన్ పక్కనే ఉండడంతో నియో మెట్రో రైల్వేస్టేషన్ వచ్చేలానిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) సుమారు రూ.73.50 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించి.. జీప్లస్5 భవనం చేపట్టాలని నిర్ణయించారు. భూగర్భంలో రెండు పార్కింగ్ కేంద్రాలు, ఆర్టీసీ కార్యాలయం, వాణిజ్య దుకాణాలు, బాంక్వెట్‌హాల్, మల్టీప్లెక్స్, హోటల్, రెస్టారెంట్ ఉండేలా రూపొందించారు. ఒకేసారి 35 బస్సుల వరకు నిలిపి ఉంచేలా ప్లాట్‌ఫామ్‌లు డిజైన్ చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. పూర్తయితే వరంగల్ పరిధి రూపురేఖలు మారిపోనున్నాయి.

24 అంతస్తులు.. 2 వేల పడకలు

వరంగల్ నగరం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో సెంట్రల్ జైలు ప్రాంగణంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. మొదట్లో రూ.1,150 కోట్లతో 24 అంతస్తులు, 2వేల పడకలతో నిర్మాణం చేపట్టారు. 24 అంతస్తుల్లో 8 క్లినికల్ విభాగానికి, 3 అంతస్తులు అడ్మినిస్ట్రేషన్ విభాగానికి, మిగతా అంతస్తులు మెడికల్ ఎడ్యుకేషన్ ఉపయోగించే విధంగా నిర్మాణం చేపట్టారు. రూ.1,150 కోట్ల ఆస్పత్రి వ్యయాన్ని సదరు నిర్మాణ ఏజెన్సీ రూ. 1,750 కోట్లకు పెంచింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి పనులపై సమీక్షించింది. సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆస్పత్రి పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. ఏదిఏమైనా నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు పొందొచ్చు.

ఓరుగల్లులో సంస్కరణల సారథి

● 1992లో నిర్వహించిన కేయూ స్నాతకోత్సవానికి మన్మోహన్‌సింగ్


కేయూ స్నాతకోత్సవంలో అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ మన్మోహన్‌సింగ్, గవర్నర్ కృష్ణకాంత్, వీసీ జయశంకర్. కార్యక్రమానికి వస్తున్న మన్మోహన్.

కేయూ క్యాంపస్ : 1992లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆర్థిక సంస్కరణల సారథి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు. అప్పటి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కొత్తపెల్లి జయశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సమయంలో కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నడాక్టర్ మన్మోహన్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆర్ఈసీ (ప్రస్తుత నిట్) ఆడిటోరియంలో కేయూ స్నాతకోత్సవం నిర్వహించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్‌తో కలిసి పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ ప్రదానం కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. ప్రముఖ కవి దివంగత కాళోజీనారాయణరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు దివంగత నేరేళ్ల వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ 2004నుంచి 2014వరకు భారత ప్రధానిగా పదేళ్లపాటుసేవలు అందించారు. అంతకంటే ముందు అనేక పదవులు నిర్వర్తించారు. ఈనెల 26న రాత్రి మన్మోహన్ సింగ్ తుదిశ్వాసవిడిచిన విషయం విధితమే.

వికటించిన హెర్బల్ మందు..

● చికిత్స పొందుతూ మహిళ మృతి


యాదలక్ష్మి(ఫైల్)

చెన్నారావుపేట: హెర్బల్ మందు వాడగా వికటించడంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మహిళ శుక్రవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బోజేర్వుకు చెందిన మిరాల మల్లయ్య, రాజమ్మ దంపతుల కూతురు యాదలక్ష్మి(40) భర్తతో విడిపోయి కుమారుడు వెంకటేశ్‌తో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు అల్లోపతి వైద్యం పొందుతోంది. ఈ నెల 16వ తేదీన వరంగల్‌కు చెందిన కవిత వద్ద రూ. 3 వేలు చెల్లించి హెర్బల్ మందు కొనుగోలు చేసి మూడు రోజులు వాడింది. 19న అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు గమనించి ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. యాదలక్ష్మి మృతితో కుమారుడు వెంకటేశ్ గుండెలవిసేలా రోదించాడు. తల్లి మృతితో ఒంటరయ్యాడు. మృతురాలి సోదరుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరాడంబరంగా సీఎం కప్ పోటీలు


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న ఆదిలాబాద్, మెదక్ బాలుర జట్లు


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న మెదక్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు

● మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు శుక్రవారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి క్రీడాలోకం సంతాపం తెలియజేసింది. క్రీడలు ప్రారంభించే ముందు అధికారులు, క్రీడాకారులు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు రెండు నిమిషాలు మౌనం పాటించి మాజీ ప్రధాని మన్మోహన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్టేడియంలోని వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ మైదానాల్లో సెపక్‌తక్రా నిర్వహించగా హ్యాండ్‌బాల్ గ్రౌండ్‌లో హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగినట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన భూవివాదం..

● దారి అటకాయించి కర్రతో కొట్టి వృద్ధుడి హత్య
● కాటారం మండల కేంద్రంలో ఘటన


బుచ్చయ్య (ఫైల్)

కాటారం: భూ వివాదాలు నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. రైతు కుటుంబాల్లో సంతోషాన్ని నింపే నేలలు.. వివాదాస్పదంగా మారి రక్తపు మడుగులతో అదే రైతు కుటుంబాల్లో విషాదాలకు దారితీస్తున్నాయి. కొన్నేళ్లుగా భూమి హద్దుల విషయంలో నెలకొన్న గొడవలతో ఓ వృద్ధుడిని దారి అటకాయించి హత్య చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఇప్పలగూడేనికి చెందిన డొంగిరి బుచ్చయ్య(65)కు కాటారం శివారులోని సర్వే నంబర్ 501లో 1.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి హద్దుల విషయంలో సాదారి పోచయ్య, అతడి కుమారులు సమ్మయ్య, అంకయ్య, లింగయ్య, మృతుడు బుచ్చయ్య మధ్య మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా పరిష్కారం కాకపోవడంతో బుచ్చయ్య గత మే నెలలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు కొనసాగుతోంది. కాగా, ఇదే విషయంలో బుచ్చయ్య శుక్రవారం ఉదయం భూమి వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో బుచ్చయ్యకు సాదారి లింగయ్య అతడి భార్య శోభ మధ్య వాగ్వాదం నెలకొంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో బుచ్చయ్య తన భార్య సారమ్మకు ఫోన్‌లో విషయం తెలిపి అక్కడి నుంచి బయలుదేరాడు. దాడి విషయం లింగయ్య తన కుమారుడు పవన్‌కు సమాచారం అందించాడు. ఆవేశానికి గురైన పవన్ ఇప్పలగూడెంలోని హనుమాన్ టెంపుల్ వద్ద బుచ్చయ్య బైక్‌పై వెళ్తున్న క్రమంలో అటకాయించి కర్రతో కొట్టడంతో కిందపడ్డాడు. దీంతో పవన్ వెంటనే బుచ్చయ్య తలపై విచక్షణారహితంగా కొట్టడంతో మృతిచెందాడు. ఈ క్రమంలో మృతుడి భార్య సారమ్మ, కూతుళ్లు దుర్గం సుగంధ, జాడి శోభ పొలం వద్దకు వెళ్తూ బుచ్చయ్యపై దాడి జరగడాన్ని గమనించి అక్కడికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. హత్యకు పాల్పడిన పవన్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న కాటారం సీఐ నాగార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దీక్షాంత్ పరేడ్ రద్దు..


తల్లికి టోపి పెడుతున్న కుమారుడు


భార్యకు టోపి పెడుతున్న కానిస్టేబుల్


తల్లికి పాదాభివందనం చేస్తున్న కానిస్టేబుల్


తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటూ..


తనకు కాబోయే భార్య పావనికి సెల్యూట్ చేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్

మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో పరేడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ
● నిరుత్సాహంతో వెనుదిరిగిన స్పెషల్ కానిస్టేబుళ్ల బంధువులు

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో శుక్రవారం జరగాల్సిన 457 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) రద్దుయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ దీక్షాంత్ పరేడ్ రద్దు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ టీజీ ఎస్పీ కమిషరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీక్షాంత్ పరేడ్ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కామాండెంట్ రాంప్రకాశ్ వెల్లడించారు. కాగా, కానిస్టేబుళ్ల బంధువులు, స్నేహితులు ఉదయమే పరేడ్ ప్రాంగణానికి చేరారు. దీంతో కానిస్టేబుళ్లు.. బంధువులను కలిసి ముచ్చటిస్తూ ఆనందంలో మునిగితేలారు. మరో కొద్ది నిమిషాల్లో బాధ్యతలు చేపడుతామనుకునే సమయంలో పరేడ్ రద్దయిందని తెలియడంతో ఆ క్షణం వరకు ఆనందంగా ఉన్న కానిస్టేబుళ్లు, వారి బంధువులు ఒక్కసారి నిరుత్సాహానికి గురయ్యారు. దీంతో చేసేది ఏమిలేక కానిస్టేబుళ్లు తమ కుటుంబ సభ్యులు, బంధువులతో ఫొటోలు దిగుతూ గడిపారు. కుటుంబీకులు, బంధువులు కొద్ది సమయం సేదదీరిన అనంతరం వెనుదిరిగారు.